సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శుక్రవారం, 2, ఆగస్టు, 2024



సోమశిలలో 9.471 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో గురువారం సాయంత్రానికి 9.471 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పెన్నార్ డెల్టాకు, ఉత్తర, దక్షిణ కాలువలకు 210 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.72,000
22 క్యారెట్లు ఆర్నమెంట్ (గ్రా)	రూ.6,466
3శాతం జీఎస్టీతో	రూ.6,666
నవర (8గ్రా)	రూ.53,280

గరిష్టం/కనిష్టం
37.2 /29.8

వాతావరణం

గాలిలో తేమ 51 శాతంగా గురువారం నమోదైంది. జిల్లాలో వాతావరణం శుక్రవారం పొడిగానే ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

డయేరియా రోగులకు డీఎంహెచ్‌ఓ పరామర్శ



రోగులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ పెంచలయ్య తదితయులు

చేజర్ల: డయేరియా (అతిసార వ్యాధి)పై జాగ్రత్తగా ఉండాలని వైద్యశాఖ అధికారులకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి ఎం పెంచలయ్య సూచించారు. వారం రోజులుగా అతిసార వ్యాధి ప్రబలిన పాడేరు గ్రామంలో గురువారం ఆయన పర్యటించి బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఈ వ్యాధి అదుపులోకి వచ్చిందని అయినా మెడికల్ క్యాంపును కొనసాగిస్తామని తెలిపారు. పాడేరు ఎస్సీ కాలనీలో పర్యటించి రోగుల ఆరోగ్య సమాచారం తెలుసుకొన్నారు. అనంతరం మెడికల్ క్యాంపును సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట వైద్యురాలు మెహతాబ్ ఉన్నారు.

జిల్లా బాల్ బ్యాడ్మింటన్ జట్ల ఎంపికలు 4న

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 4వ తేదీన జిల్లా సబ్ జూనియర్ బాలబాలికల జట్ల ఎంపికలు జరుగుతాయని ఆ అసోసియేషన్ కార్యదర్శి ఐ. రమేష్‌బాబు గురువారం తెలిపారు. నెల్లూరు ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఉదయం 8.30 గంటలకు ఎంపికలు ప్రారంభమవుతాయన్నారు. వయస్సు ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని కోరారు. ఎంపికైన క్రీడాకారులు సెప్టెంబర్‌లో తూర్పు గోదావరి జిల్లా అన్నవరంలో జరిగే 9వ రాష్ట్ర సబ్ జూనియర్ అంతర్ జిల్లాల పోటీలకు జిల్లా తరుపున ప్రాతినిధ్యం వహిస్తారని వివరించారు.

606 పొగాకు బేళ్ల విక్రయం

మర్రిపాడు: డీసీపల్లి వేలం కేంద్రంలో గురువారం 606 పొగాకు బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి జీ రాజశేఖర్ తెలిపారు. వేలానికి 650 బేళ్లు రాగా వాటిలో 606 బేళ్లు విక్రయించామని, మిగిలిన బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించినట్లు తెలిపారు. వేలంలో 74,275 కిలోల పొగాకును విక్రయించగా రూ.2,09,29,378 వ్యాపారం జరిగింది. గరిష్ట ధర కిలో ఒక్కంటికి రూ.358 కాగా కనిష్ట ధర రూ.205 లభించింది. వేలంలో 14 కంపెనీలకు చెందిన వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

న్యాయవాదులు నేడు కోర్టు విధుల బహిష్కరణ

నెల్లూరు (లీగల్): విజయవాడ బార్ అసోసియేషన్ సభ్యుడు సీనియర్ న్యాయవాది ఓ. గవాస్కర్‌పై విజయవాడ పోలీసులు నమోదు చేసిన కేసును ఖండిస్తూ అందుకు నిరసనగా నెల్లూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు శుక్రవారం కోర్టు విధులను బహిష్కరిస్తున్నట్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమామహేశ్వర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సుందరయ్య యాదవ్ తెలిపారు. జిల్లా కోర్టు ఆవరణలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో గురువారం అత్యవసర కమిటీ సమావేశం నిర్వహించి న్యాయవాదిపై బనాయించిన అక్రమ కేసుకు నిరసనగా కోర్టు విధులను బహిష్కరించాలని ఏకగ్రీవంగా తీర్మానించినట్టు తెలిపారు.

నేడు మంత్రి జనార్దన్‌రెడ్డి రామాయపట్నం పోర్టుకు రాక

నెల్లూరు(దర్గామిట్ట): రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ, మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి శుక్రవారం రామాయపట్నం పోర్టును సందర్శించనున్నారు. 2వ తేదీ ఉదయం 11.30 గంటలకు మంత్రితో పాటు ఆశాఖ కార్యదర్శి ఎస్ సురేష్ కుమార్, మారిటైం బోర్డు సీఈఓ సీవీ ప్రవీణ్ ఆదిత్య, కలెక్టర్ ఆనంద్, ఇతర అధికారులతో కలసి రామాయపట్నం పోర్టులో జరుగుతున్న అభివృద్ధి పనులను మంత్రి పరిశీలిస్తారు. మధ్యాహ్నం 2 గంటలకు రామాయపట్నం పోర్టు నుంచి బయలుదేరి 2.45 గంటలకు జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ చేరుకుని అక్కడ జరుగుతున్న పనులను పరిశీలిస్తారు. అనంతరం అక్కడ నుంచి విజయవాడకు వెళ్తారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు 10 లోపు ప్రతిపాదనలు పంపాలి

నెల్లూరు (టౌన్): ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా 2024 సంవత్సరానికి సంబంధించి రాష్ట్ర, జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు వారి ప్రతిపాదనలను ఈనెల 10వ తేదీ లోపు డిప్యూటీ డీఈఓలు, ఎంఈఓల ద్వారా జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సమర్పించాలని ఇన్‌చార్జి డీఈఓ గ్లోరికుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

మంత్రి సాక్షిగా పచ్చమూక దాదాగిరి

- నెల్లూరు కార్పొరేషన్‌లో సమావేశం నిర్వహించిన మంత్రి నారాయణ
- మంత్రి సమీక్ష నిర్వహించే గదిలోకి దూసుకెళ్లేందుకు ప్రయత్నించిన ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి అనుచరులు
- కార్యాలయంలోకి ఎమ్మెల్యేను పంపి అనుచరులను నిలువరించే ప్రయత్నం చేసిన సీఐ హుస్సేన్
- మమ్మల్నే అడ్డుకుంటావా అంటూ సీఐపై దౌర్జన్యానికి దిగిన వైనం
- ఏయ్, నీ సంగతి చూస్తామంటూ సీఐ పైకి దూసుకెళ్లిన నాయకులు
- టీడీపీ నేతల వీరంగాన్ని నిలువరించ లేకపోయిన మంత్రి నారాయణ
- మంత్రి సమీక్షను అడ్డుకునేందుకు ఎమ్మెల్యే అనుచరుల వీరంగం
- వారిపై కేసులు నమోదు చేసేందుకు వెనుకాడుతున్న పోలీసులు

టీడీపీ నేతల అరాచకాలు రోజురోజుకు మితిమీరిపోతున్నాయి. సామాన్య ప్రజల మాన ప్రాణాలను తీస్తున్న పచ్చ నేతలు పోలీసులపైన కూడా దౌర్జన్యాలకు దిగుతున్నారు. అధికారం ఉందని రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అనుచరులు గురువారం డ్యూటీలో ఉన్న సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌పై దాదాగిరికి దిగారు. రాష్ట్ర పురపాలక శాఖమంత్రి నారాయణ రివ్యూ సమావేశం నిర్వహిస్తున్న సమయంలోనే ఎమ్మెల్యే అనుచరులు డ్యూటీలో ఉన్న సీఐపై దురుసుగా ప్రవర్తిస్తున్నా మంత్రి పట్టించుకోలేదు. ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తన అనుచరుల దౌర్జన్య కాండను పర్యవేక్షించారు. పోలీసులకు అధికార పార్టీ నేతల నుంచి ఘోర అవమానం జరిగినా కేసులు నమోదు చేసే పరిస్థితి లేకుండాపోయింది.



నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో నాలుగో పట్టణ సీఐ అల్తాఫ్ హుస్సేన్‌పై రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సమక్షంలో దౌర్జన్యం చేస్తున్న ఆయన అనుచరులు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: నెల్లూరు నగర పాలక సంస్థ కార్యాలయ ఆవరణంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ భవనంలో గురువారం టౌన్‌ప్లానింగ్ విభాగానికి సంబంధించిన సమస్యలపై ప్రజల నుంచి ఫిర్యాదులు సేకరించి వాటి పరిష్కారం కోసం స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం 11.30 గంటలకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్వయంగా రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ, కమిషనర్ సూర్యతేజ ఇతర అధికారులతో కలిసి స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహిస్తుండగా నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి వందలాది మంది అనుచరులతో కలసి కార్యాలయానికి వచ్చేశారు. ఆ సమయంలో కమాండ్ కంట్రోల్ సెంటర్ భవన ప్రధాన ద్వారం వద్ద నెల్లూరు నాలుగో పట్టణ సీఐ అల్తాఫ్ హుస్సేన్ డ్యూటీ నిర్వహిస్తున్నాడు. ఎమ్మెల్యే కోటంరెడ్డి వందలాది అనుచరులతో కమాండ్ కంట్రోల్ సెంటర్ భవనంలోకి దూసుకెళ్లేందుకు ప్రయత్నించగా అక్కడ డ్యూటీలో ఉన్న సీఐ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డితో పాటు అతని అనుచరులైన ఇద్దరు ముగ్గురిని లోనికి పంపి మిగిలిన వారిని వెళ్లొద్దని చేతులు అడ్డు పెట్టారు. దీంతో ఎమ్మెల్యే అనుచరులు అధికార పార్టీకి చెందిన వాళ్లం మమ్మల్నే అడ్డుకుంటావా అంటూ సీఐ ఆల్తాఫ్ హుస్సేన్‌పైకి దాడికి యత్నించారు. సీఐ దౌర్జన్యాలను అరికట్టాలి.. సీఐను వెంటనే సస్పెండ్ చేయాలి అంటూ నినాదాలతో హోరెత్తిస్తూ గందరగోళాన్ని సృష్టించారు. ఒకానొక దశలో పోలీసుల పైకి దాడి చేసేందుకు యత్నించి వాగ్వాదానికి దిగారు. నెల్లూరు నగర డీఎస్పీ శ్రీనివాసులురెడ్డి వారికి నచ్చజెప్పేందుకు ప్రయత్నించినా వారు వెనక్కి తగ్గలేదు..

సమావేశ మందిరంలో వీరంగం..

మంత్రి నారాయణ నిర్వహించే స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం జరిగే కార్యాలయంలోకి ఎమ్మెల్యేతో కలిసి వెళ్లిన అనుచరులు అక్కడకు వచ్చిన సీఐ అల్తాఫ్ హుస్సేన్‌ను చూసి మరోసారి వీరంగం చేశారు. సీఐ గెటౌట్ అంటూ.. ఇక్కడి నుంచి తీసుకెళ్లిపోండి అంటూ పోలీస్ సిబ్బంది ముందు హడావుడి చేశారు. దీంతో పోలీస్ సిబ్బంది తమ సీఐను ఎందుకు తీసుకెళ్లాలి అంటుండగానే టీడీపీ శ్రేణులు ఏంరా ఒళ్లు ఎలా ఉంది అంటూ వారిపై విరుచుకుపడ్డారు. ఆ క్షణంలో పోలీసులు, టీడీపీ శ్రేణులు ఒకరిపై ఒకరు ఆగ్రహావేశాలతో తోపులాట చోటు చేసుకుంది. పరిస్థితి ఉద్రిక్తంగా మారి బాహాబాహీకి దిగే స్థాయికి వెళ్లడంతో రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి, డీఎస్పీ శ్రీనివాసులురెడ్డి మరో ఇద్దరు సీఐలు తమ సిబ్బందితో కలిసి టీడీపీ నేతలను అదుపు చేసి బయటకు పంపించేశారు. ఈ తతంగమంతా మంత్రి నారాయణ వీక్షిస్తున్నారే గానీ ఎమ్మెల్యే అనుచరులను నిలువరించలేకపోయారు. కనీసం వారిని మందలించే ప్రయత్నం కూడా చేయలేదు. డ్యూటీ చేస్తున్న సీఐపై పట్ల దురుసుగా ప్రవర్తించిన వారిని మంత్రి నిలువరించకపోవడంతో పోలీసులు లోలోన రగిలిపోయారు.

మంత్రి కార్యక్రమాన్ని రసాభాస చేసేందుకే వచ్చారా?

నెల్లూరు కార్పొరేషన్ పరిధిలో నెల్లూరు సిటీ, నెల్లూరు రూరల్ నియోజకవర్గాలు కలిసి ఉన్నాయి. ప్రస్తుతం నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి కనుసన్నల్లో కార్పొరేషన్ కార్యకలాపాలు జరుగుతున్నాయి. మంత్రి నారాయణ నెల్లూరు సిటీ ఎమ్మెల్యే అయినప్పటికీ ఆయనకున్న బిజీ వ్యవహారాల్లో కార్పొరేషన్ వ్యవహారాలపై దృష్టి పెట్టలేదు. కార్పొరేషన్‌లో ఏపని జరగాలన్నా ఎమ్మెల్యే కార్యాలయం నుంచి ఆదేశాలు వెళ్లాలి. ఈ క్రమంలో మంత్రి నారాయణ నెల్లూరు కార్పొరేషన్ పరిధిలోని టౌన్‌ప్లానింగ్ విభాగంలో పేరుకుపోయిన పెండింగ్ దరఖాస్తులు క్లియరన్స్ చేసేందుకు స్పెషన్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహించడం నెల్లూరు రూరల్ ఎమ్మెల్యేకు రుచించలేదు. ఎక్కడ తమ పరపతికి ఇబ్బంది కల్గుతుందోనని భావించిన ఎమ్మెల్యే మంత్రి నారాయణ కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు తన అనుచరులతో వెళ్లారన్న ప్రచారం ఉంది. ఇందులో భాగంగానే సీఐని టార్గెట్ చేసి కార్యక్రమానికి అంతరాయం కల్గించారని మంత్రి అనుచరులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు.

కేసులు పెట్టేందుకు జంకిన పోలీసులు

డ్యూటీలో ఉన్న సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌పై దురుసుగా ప్రవర్తించిన ఎమ్మెల్యే అనుచరులపై కేసులు నమోదు చేసేందుకు పోలీసులు జంకుతున్నారు. డ్యూటీలో ఉన్న సీఐ స్థాయి అధికారికి ఘోరంగా అవమానం జరిగినా జిల్లా పోలీసు ఉన్నతాధికారులు మౌనం పాటించడంపై విమర్శలు వస్తున్నాయి.



పోలీసులపై దౌర్జన్యానికి దిగుతున్న శ్రీధర్‌రెడ్డి అనుచరులు




సీఐ హుస్సేన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న శ్రీధర్‌రెడ్డి అనుచరులు

సోమశిల రిజర్వాయరే శరణ్యం

బనకచర్ల డ్యాం నుంచి వస్తున్న జలాలు

- ప్రస్తుతం డెడ్ స్టోరేజీలో కండలేరు, సోమశిల ప్రాజెక్టులు
- జలాశయాల్లోకి తగినంత నీరు చేరితేనే ఖరీఫ్, రబీ పంటల సాగు



సోమశిల జలాశయం

పొదలకూరు: శ్రీశైలం డ్యామ్‌కు ఎగువ నుంచి 4.30 లక్షల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుండడంతో జిల్లాలోని నాన్ డెల్టా రైతులు పంటల సాగుపై ఆశలు పెంచుకుంటున్నారు. ఇప్పటికే ఖరీఫ్ పంటల సాగు చేస్తున్న రైతులు సోమశిల జలాశయానికి శ్రీశైలం నుంచి నీరు వచ్చి చేరితే రబీ పంటల సాగుకు ఢోకా ఉండదని ఆశపడుతున్నారు. గత రబీపై ఆశలు వదులుకున్న రైతులు మిచాంగ్ తుఫాను ప్రభావం వల్ల చెరువులు, కుంటల్లోకి నీరు చేరడంతో పాటు జలాశయాలకు సైతం స్వల్పంగా నీరు రావడంతో పంటలు పండించుకున్నారు. అయితే ఈ పర్యాయం పైతట్టు ప్రాంతం నుంచి లక్షల క్యూసెక్కుల వరదనీరు శ్రీశైలంకు వచ్చి చేరుతోంది. ఇప్పటికే 210 టీఎంసీల నీరు ఉన్నట్టు అధికారులు లెక్కలు కడుతున్నారు. సోమశిలకు పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ ద్వారా నీటిని విడుదల చేశారు. 18 వేల క్యూసెక్కుల నీటిని హెడ్‌రెగ్యులేటర్ ద్వారా విడుదల చేస్తుండగా బనకచర్ల డ్యాంకు నీరు చేరుకుంటోంది. అక్కడి నుంచే సోమశిలకు శ్రీశైలం జలాలను విడుదల చేస్తున్నట్లు ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. దీంతో ముందుగా సోమశిల జలాశయానికి నీరు చేరుతుంది. డెడ్‌స్టోరేజీలో ఉన్న సోమశిలకు పైతట్టు నుంచి నీటిని విడుదల చేయడం శుభపరిణామంగా రైతులు పేర్కొంటున్నారు.

నాన్‌డెల్టా రైతుల ఆశలు

గత ప్రభుత్వంలో వరుసగా నాలుగేళ్లు సోమశిల జలాశయం నిండి కండలేరుకు నీటిని విడుదల చేశారు. గత రబీలో మాత్రం పైతట్టు నుంచి వరద నీరు లేక, జిల్లాలో కరువు ఛాయలు అలముకుని రెండు జలాశయాల్లోకి నీరు వచ్చి చేరలేదు. అయితే తుఫాను ప్రభావం వల్ల చెరువుల్లోకి నీరు చేరి 70 శాతం వరినాట్లు పడ్డాయి. అయితే ఈ ఏడాది ముందుగానే వరద ప్రవాహం వల్ల సోమశిలకు నీరు వచ్చే చేరుతున్నందున కండలేరుకు కూడా సాగు నీటిని విడుదల చేస్తారని రైతులు ఆశపడుతున్నారు. ఈ మేరకు అధికారులు, ప్రజాప్రతినిధులు సైతం రెండు జలాశయాలకు నీటిని విడుదల చేస్తామని ప్రకటించారు. ప్రస్తుతం ఈ ప్రాంతంలో ఖరీఫ్ కింద కొన్ని గ్రామాల్లో వరిసాగు అవుతుండగా మరి కొన్ని గ్రామాల్లో మెట్ట పంటలను సాగు చేస్తున్నారు. వర్షం కురుస్తున్నా పంటల సాగుకు పనికిరావడం లేదు. ఫలితంగా సోమశిల జలాలపైనే రైతులు ఆధారపడాల్సి వస్తుందని పేర్కొంటున్నారు.

జలాశయాల్లో డెడ్ స్టోరేజీ

జిల్లాకు జీవనాడి వంటి సోమశిల, కండలేరు జలాశయాలు డెడ్ స్టోరేజీలో ఉన్నాయి. సోమశిలలో 9.5 టీఎంసీలు, కండలేరు 6.45 టీఎంసీలు ఉన్నట్టు అధికారులు వెల్లడిస్తున్నారు. సోమశిలకు వరదనీరు వచ్చి చేరిన తర్వాతనే కండలేరుకు ఫ్లడ్ ఫ్లో కెనాల్ ద్వారా నీటిని విడుదల చేయాల్సి ఉంటుంది.

కృష్ణాజలాల చేరిక

- జలాశయానికి 2,754 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

సోమశిల: సోమశిల జలాశయం ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు బనకచర్ల ప్రాజెక్టుకు ఐదు రోజుల క్రితం కృష్ణా జలాలను విడుదల చేశారు. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి సోమశిల జలాశయానికి 2,754 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోందని ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు. బుధవారం ఆదినిమ్మాయపల్లె గేజ్ వద్ద 4 వేల క్యూసెక్కులుగా ఇన్‌ఫ్లో నమోదు అయిందని ప్రాజెక్ట్ అధికారులు పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రానికి మరో 5వేల క్యూసెక్కులు వచ్చే అవకాశం ఉందని ప్రాజెక్ట్ అధికారులు భావిస్తున్నారు. 10 వేల క్యూసెక్కుల కృష్ణా జలాలను విడుదల చేస్తుండగా కుందు, తెలుగుగంగ రిజర్వాయర్లకు కొంత కేటాయించిన అనంతరం పూర్తిస్థాయిలో వరద ప్రవాహం వచ్చి చేరుతుందని భావిస్తున్నారు. ప్రస్తుతం జలాశయంలో 9.471 టీఎంసీల నీరు నిల్వ ఉండగా కృష్ణాజలాల రాకతో జిల్లా రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సాగు, తాగునీటికి ఢోకా ఉండదని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

టీడీపీ నేతలు మా భూమిని ఆక్రమించారు

- మాజీ సైనికుడి భార్య వేదన



వెంకటయ్యకు కేటాయించిన ఏక్తా లీజు పట్టాను చూపుతున్న ఆయన భార్య చెన్నమ్మ

ఆత్మకూరురూరల్: మండలంలోని బండారుపల్లికి చెందిన మాజీ సైనిక సభ్యుడు ఓబుల వెంకటయ్య కుటుంబానికి ప్రభుత్వం కేటాయించిన ఐదు ఎకరాల పొలానికి గ్రామంలోని కొందరు నేతలు ఎసరు పెడుతున్నారని బాధిత కుటుంబ సభ్యులు వాపోయారు. సదరు భూమికి సంబంధించిన వివరాలను గురువారం స్థానిక విలేకర్లకు చెప్పి తమ ఆవేదన వ్యక్తం చేశారు. సైన్యంలో పనిచేసిన వెంకటయ్య మృతి చెందడంతో ఆయన సతీమణి చెన్నమ్మ ఆ భూమిని సాగు చేసుకుంటుండగా ఇటీవల అనారోగ్య సమస్యలతో చెన్నైలో చికిత్స కోసం వెళ్లింది. ఈ నేపథ్యంలో గ్రామంలోని టీడీపీకి చెందిన కమ్మ ప్రసాద్, కమ్మ దశయ్య, నాయుడు శీనయ్య, కర్ణం వెంగయ్య, కె.వెంగయ్యలు ఈ పొలాన్ని ఆక్రమించుకొని బెదిరింపులకు పాల్పడుతున్నారని బాధిత కుటుంబీకులు ఆవేదన వ్యక్తంచేశారు. ఈ క్రమంలో రెవెన్యూ, పోలీసు అధికారులకు సైతం వినతి పత్రాలు అందజేశామని, తమకు న్యాయం చేయాలని వారు వేడుకున్నారు.

శ్రీవాసవి దేవస్థానంలో ఉద్రిక్తత

- ముక్కాల ద్వారకానాథ్‌ను అడ్డుకున్న స్వయం ప్రకటిత నూతన కమిటీ
- నిరసన వ్యక్తం చేస్తూ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ముక్కాల బైఠాయింపు
- ఇరువర్గాల తోపులాటతో ఘర్షణ వాతావరణం
- పోలీసులు రంగప్రవేశం చేసి శాంతింపజేసిన వైనం
- ఆర్యవైశ్య సంఘీయుల్లో గందరగోళం



విలేకరులతో మాట్లాడుతున్న ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర నాయకుడు ముక్కాల ద్వారకానాథ్‌ను అడ్డుకుంటున్న పోలీసులు

నెల్లూరు(బృందావనం): నగరంలోని స్టోన్‌హౌస్‌పేటలో ఉన్న శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో గురువారం రాత్రి ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఆషాడమాసం శుక్రవారం జరిగే అమ్మవారి శాకంబరి అలంకారం ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు, మీడియా సమావేశం నిర్వహించేందుకు విచ్చేసిన ఆలయ పాలకమండలి గౌరవ అధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్‌ను నూతనంగా ఏర్పాటు చేసుకున్న పాలకమండలి అధ్యక్షుడు కోట గురుబ్రహ్మం, కమిటీ సభ్యులు అడ్డుకున్నారు. దీంతో ఆలయ ప్రాంగణంలో ఇరువర్గాల వాదులాటతో గందరగోళం చోటుచేసుకుని కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితి తలెత్తింది. చివరకు ఇరువర్గాలను పోలీసులు శాంతింపజేసి పంపించి వేయడంతో వివాదం తాత్కాలికంగా సద్దుమణిగింది. వివరాల్లోకెళితే.. ప్రతి ఏటా నిర్వహించేలా శాకంబరి అలంకారాన్ని వైభవంగా నిర్వహిస్తున్నామంటూ 2500 కేజీల కాయగూరలతో, 200 కేజీల పుచ్చకాయలతో, 300 కిలోల పండ్లతో, 500 కిలోల కరివేపాకుతో శాకంబరి అలంకారం చేస్తున్నామని భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకోవాలని మాట్లాడసాగారు. ఇంతలో బుధవారం జరిగిన సమావేశంలో నూతన పాలకమండలి అధ్యక్షుడిగా ప్రకటించుకున్న కోట గురుబ్రహ్మం, ఆ కమిటీ సభ్యులు కొందరు పోలీసు బలగంతో ఆలయంలోకి ప్రవేశించారు. మీడియాతో మాట్లాడుతున్న ముక్కాల ద్వారకానాథ్‌ను సీఐ బాబి అడ్డుకుని ఆలయ ప్రాంగణంలో మీడియా సమావేశం నిర్వహించరాదని, వెలుపలికి వెళ్లి మాట్లాడాలంటూ దురుసుగా ప్రవర్తించారు. దీంతో ద్వారకానాథ్ తీవ్ర అసహనం వ్యక్తం చేస్తూ ఆలయంలోకి పోలీసులు ఎందుకు వచ్చారు? మీకు సంబంధం ఏముంది? ఈ ఆలయం ఆర్యవైశ్య సంఘీయులది. ఆలయంలోకి ప్రవేశించే అర్హత మీకులేదు. ఆలయంలోకి రావద్దనేందుకు మీరెవరు అంటూ ద్వారకానాథ్ సీఐ బాబిని నిలదీశారు. ఇది పూర్తిగా ఆర్యవైశ్య సంఘీయులకు సంబంధించిన ఆలయమంటూ దీటుగా బదులిచ్చారు. అమ్మవారిని దర్శించుకోవాలంటే ఎవరి అనుమతులు అవసరం లేదని ద్వారకానాథ్ స్పష్టం చేశారు.

ద్వారకానాథ్‌ను ఆలయం వెలుపలికి తీసుకెళ్లేందుకు పోలీసులు విశ్వప్రయత్నం చేశారు. అయితే ఆయనకు మద్దతుగా నిలిచిన ఆర్యవైశ్య సంఘీయులు పోలీసుల చర్యలను నిరసిస్తూ జై వాసవి మాత... జై జై వాసవి మాత... పోలీసుల జులుం నశించాలంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. దీంతో ఆలయంలో గందరగోళం నెలకుంది. ఇరువర్గాలు తోపులాటకు దిగడంతో పోలీసులు ఇరువర్గాలను నిలువరించి ఘర్షణ జరుగకుండా అడ్డుకున్నారు.

గురుబ్రహ్మం ఓవరాక్షన్

ఈ సమయంలో బుధవారం ఏర్పాటైన నూతన కమిటీ స్వయం ప్రకటిత అధ్యక్షుడు కోట గురుబ్రహ్మం పోలీసుల అండచూసుకుని మీడియా పట్ల దురుసుగా వ్యవహరించారు. ఓవరాక్షన్ చేశారు. ఆలయం నుంచి వెలుపలికి వెళ్లిపోవాలంటూ హుకుం జారీచేశారు. ప్రతి ఏటా జరిగే సమావేశానికి తాము వస్తున్నామని మీరు అడ్డుకోవడమేంటని మీడియా ప్రతినిధులు ప్రశ్నించడంతో గురుబ్రహ్మం మిన్నకుండిపోయారు. ఈ దశలో విలేకరులతో మాట్లాడుతున్న ముక్కాల ద్వారకానాథ్‌ను ఆలయ ప్రాంగణం నుంచి వెలుపలికి తీసుకెళ్లేందుకు విశ్వ ప్రయత్నం చేశారు. అయితే ద్వారకానాథ్ అనుచరులు ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తూ అక్కడే ఉండిపోయారు. ఇరువర్గాలను పోలీసులు శాంతింపజేశారు. తరువాత ముక్కాల ద్వారకానాథ్ ఆలయ ప్రవేశ ద్వారం వద్ద బైఠాయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనరల్‌బాడీ సమావేశం ఈ నెల 18న జరుగనుందని, ఆ రోజు సభ్యులుగా ఉన్న సుమారు నాలుగు వేల మంది వస్తారని తెలిపారు. అప్పుడు నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. పదిమందితో ఏర్పాటైన కమిటీకి ఆలయ నిధులను అప్పగించే ప్రసక్తే లేదన్నారు.

అధికారబలంతో ఆలయంలోకి ప్రవేశం

గత కొన్ని రోజులుగా తాము ఆలయాన్ని స్వాధీనం చేసుకుంటామంటూ ప్రకటిస్తూ వచ్చిన నేతలు అధికారబలం అండదండలు చూసుకుని బుధవారం బరితెగించారు. తామే సభ్యులమంటూ నూతన కమిటీని ప్రకటించి ప్రమాణ స్వీకారం చేశారు. మున్నెన్నడూ లేని విధంగా దేవస్థానం వద్ద చోటుచేసుకున్న సంఘటనలతో అటు ఆర్యవైశ్య సంఘీయులు, ఇటు ప్రజలు విస్మయం చెందారు.



ఆలయం వద్ద బైఠాయించిన ద్వారకానాథ్

క్లుప్తంగా

వైఎస్‌ జగన్‌తో విక్రమ్‌రెడ్డి, రాజారెడ్డి



మాజీ ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌ రెడ్డిని కలిసిన మేకపాటి విక్రమ్‌రెడ్డి, మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, మేకపాటి అభినవ్‌రెడ్డి

ఆత్మకూరు: వైఎస్సార్‌సీపీ అధినేత, రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డిని ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌ రెడ్డి, ఉదయగిరి నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. గురువారం తాడేపల్లిలోని పార్టీ కార్యాలయంలో వైఎస్‌ జగన్‌ను కలిసి పలు విషయాలపై చర్చించారు. రాబోయే రోజుల్లో నియోజకవర్గాల్లో చేపట్టబోయే పార్టీ కార్యక్రమాలపై చర్చించారు. పార్టీకి పూర్వ వైభవం కోసం తమ వంతు కృషి చేస్తామన్నారు. వారి వెంట పార్టీ యువ నాయకుడు మేకపాటి అభినవ్‌రెడ్డి ఉన్నారు.

పారిశ్రామికాభివృద్ధితోనే ఆర్థిక స్థితి మెరుగు



పార్లుకట్ట ప్రాంతంలో వృద్ధుడికి పింఛన్‌ అందజేస్తున్న మంత్రి నారాయణ

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధి జరిగితేనే ప్రజల ఆర్థిక స్థితిగతులు మెరుగు పడతాయని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. గురువారం నెల్లూరు నగరంలోని పార్లుకట్ట ప్రాంతంలో పింఛన్ల పంపిణీలో ఆయన పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సామాజిక పింఛన్‌ను నెలకు రూ.4 వేల చొప్పున అందిస్తున్నామన్నారు. మంత్రి నారాయణ పార్లుకట్ట ప్రాంతంలో పర్యటించి ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి జేసీ, నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్‌ సూర్యతేజ, మాజీ మేయర్‌ అబ్దుల్‌ అజీజ్‌ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ, ఉపాధి అవకాశం

నెల్లూరు(బారకాసు): స్వర్ణ టోల్‌ వే ప్రైవేట్‌ లిమిటెడ్‌, పీపుల్‌ ట్రీ ఫౌండేషన్‌ సంయుక్త ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతి, యువతకు ఉచిత శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు ఫౌండేషన్‌ ప్రాజెక్ట్‌ హెడ్‌ సురేష్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బుజబుజనెల్లూరు సమీపంలోని ఆర్టీసీ కాలనీ ప్రాంతంలో ఉన్న తమ కార్యాలయంలో నిర్మాణ, బ్యాంకింగ్‌, రిటైల్‌ రంగాలతో పాటు తయారీ రంగంలో శిక్షణ ఇచ్చి ఉచిత భోజన, వసతి సదుపాయం కల్పించనున్నామన్నారు. శిక్షణ అనంతరం ఉద్యోగ, ఉపాధి అవకాశం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న 18–36 ఏళ్ల లోపు నిరుద్యోగు యువతి, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 6303806524, 99481 32173 ఫోన్‌ నంబర్లలో సంప్రదించాలన్నారు.

నిర్వీర్య సంఘాల మూసివేతపై శిక్షణ



ఆన్‌లైన్‌ ద్వారా శిక్షణ ఇస్తున్న డీసీఓ గుర్రప్ప

నెల్లూరు (వీఆర్సీసెంటర్‌): సక్రమంగా పనిచేయని, నిర్వీర్య సహకార సంఘాల మూసివేతపై ఎలాంటి చర్యలు తీసుకోవాలన్న విషయలపై సహకార సిబ్బందికి జిల్లా సహకార అధికారి (డీసీఓ) గుర్రప్ప గురువారం ఆన్‌లైన్‌ ద్వారా శిక్షణ ఇచ్చారు. సహకార సంఘ సభ్యులకు సేవలు అందించని సంఘాలు, సక్రమంగా పనిచేయని సంఘాలను చట్టబద్ధమైన పద్ధతుల ద్వారా మూసివేత, సహకార చట్టం 1964, సెక్షన్‌ 64 నుంచి సెక్షన్‌ 69 వరకు చట్టబద్ధమైన పద్ధతులపై వివరించారు. సహకార సంఘం ఆస్తుల కంటే అప్పులే ఎక్కువగా ఉంటే నోటీసులు జారీ చేసే విధానం, సంఘం వ్యవహారాలపై అంతిమ ముగింపు నివేదిక, పని చేయని సంఘాలను పునరుద్ధరించి సభ్యులకు సేవలు అందించేందుకు తీసుకోవాల్సిన చర్యలు, పునరుద్ధరణకు అవకాశం లేని వాటిని మూసివేయడం వంటి అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు జిల్లాకు చెందిన డివిజనల్‌ సహకారశాఖాధికారులు, నెల్లూరు, కావలి, కందుకూరు ప్రాంతాల సహకార సిబ్బంది పాల్గొన్నారు.

నిమ్మధరలు (కిలో)



పెద్దవి : రూ.65
సన్నవి : రూ.45
పండ్లు : రూ.30

పౌల్ట్రీ అసోసియేషన్‌ ధరలు

బ్రాయిలర్‌:	రూ.112
లేయర్‌	రూ.90
బ్రాయిలర్‌ చికెన్‌:	రూ.206
స్కిన్‌లెస్‌ చికెన్‌:	రూ.230
లేయర్‌ చికెన్‌:	రూ.153



గత ప్రభుత్వంలో ఈ–క్రాప్‌ నమోదు చేస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది (ఫైల్‌)



పొలంలో రైతు ఫొటోతో కలిపి యాప్‌లో అప్‌ లోడ్‌ చేస్తున్న వీఏఏ (ఫైల్‌)

ఈ–క్రాప్‌.. అంతేనా!

- పంట నమోదు ప్రక్రియపై ఇంత వరకు మార్గదర్శకాల్లేవ్‌
- గత ప్రభుత్వంలో ప్రతి ఎకరా నమోదు
- సంక్షేమ, సబ్సిడీ పథకాలకు గీటురాయి
- బీమా పథకం నుంచి తప్పుకున్న కూటమి ప్రభుత్వం

జిల్లాలో ఈ–క్రాప్‌ నమోదు

గతేడాది ఖరీఫ్‌ సాగు లక్ష్యం **65** వేల హెక్టార్లు

సాగు జరిగి ఈ–క్రాప్‌ నమోదు **62** వేల హెక్టార్లు

ఈ ఏడాది ఖరీఫ్‌ సాగు లక్ష్యం **53,073** హెక్టార్లు

ఈ ఏడాది ఈ–క్రాప్‌ నమోదు – **0**

కర్షకులపై కూటమి ప్రభుత్వం కుట్రలు ఒక్కొక్కటిగా బయట పడుతున్నాయి. రైతులకు పారదర్శకంగా సంక్షేమ, సబ్సిడీ పథకాలు అందించడంతో పాటు విపత్తుల సమయంలో పంట నష్టం జరిగితే పరిహారం ఇచ్చేందుకు, పండిన పంటను ప్రభుత్వమే కొనుగోలు చేసేందుకు వీలుగా గత ప్రభుత్వం ఈ–క్రాప్‌ నమోదు ప్రక్రియను ప్రారంభించింది. అప్పట్లో ఈ విధానం అమల్లో ఉండడంతో రైతులు ధీమాగా ఉన్నారు. కొత్తగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని గాలికొదిలేస్తోంది. కర్షకుల పథకాలకు మంగళం పాడేలా వ్యవహరిస్తోంది. రైతుభరోసా, పంటల బీమా, ఇన్‌పుట్‌ సబ్సిడీ తదితర పథకాల అమలుపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి.

సీతారామపురం: ఖరీఫ్‌ సాగు ప్రారంభమై.. రెండు నెలలు గడిచిపోయింది. ఇంత వరకు పెట్టుబడి సాయం అందించలేదు. పంట బీమా పథకం బాధ్యత నుంచి ప్రభుత్వం తప్పుకుంది. తాజాగా ఈ–క్రాప్‌ నమోదుపై ఇంత వరకు విధి విధానాలు ప్రకటించకపోవడం చూస్తే ఈ ప్రక్రియపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. కూటమి ప్రభుత్వం అబద్ధాల హామీల జాబితాలో కలిపేసినట్లు కనిపిస్తోంది. రైతులకు సంక్షేమ పథకాలు అసలైన రైతులకు పారదర్శకంగా అందించేందుకు ఈ–క్రాప్‌ అత్యున్నత ప్రమాణంగా నిలుస్తోంది. ఈ ప్రక్రియపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. గత ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం రైతుభరోసా, పంటల బీమా, ఇన్‌పుట్‌ సబ్సిడీ తదితర పథకాలను విజయవంతంగా అమలు చేసి అన్నదాతల అభ్యున్నతికి కృషి చేసిన విషయం తెలిసిందే. అయితే రైతులకు అందించే సంక్షేమ పథకాల అమల్లో కీలకమైన ఈ–క్రాప్‌ నమోదుపై ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఎలాంటి స్పష్టత ఇవ్వకపోవడంతో ఈ సారి పథకాలు అమలవుతాయో.. లేదోనన్న ఆందోళన రైతులను వెంటాడుతోంది.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇలా..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2019 నుంచి 2023 వరకు ఈ–క్రాప్‌ ఆధారంగానే రైతులకు సంక్షేమ పథకాలను అమలు చేసేది. ఏటా ఖరీఫ్‌ సీజన్‌ ఆరంభమైన వెంటనే ఈ–క్రాప్‌ ప్రక్రియను ప్రారంభించేది. గ్రామ వ్యవసాయ సహాయకులు పంటను సాగు చేసిన క్షేత్రాల్లో రైతుతో ఫొటో తీసి, వివరాలు యాప్‌లో నమోదు చేసేవారు. ఇవన్నీ ఆర్బీకేల్లో ఏర్పాటు చేసిన కియోస్క్‌ యంత్రంలో నిక్షిప్తమయ్యేవి. ఈ–క్రాప్‌ ఆధారంగానే ఎరువులు, పురుగు మందులు, నాణ్యమైన విత్తనాలు రాయితీపై రైతులకు లభించేవి. అన్నదాతలకు ప్రభుత్వమే బీమా సొమ్ము చెల్లించి ఉచితంగా పంటల బీమా చేయించడం ద్వారా సాగుపై ధీమాగా ఉండేవారు. పండితే పంట లేకుంటే బీమా వచ్చేది. ఈ–క్రాప్‌ ఆధారంగానే ప్రభుత్వం పంట కొనుగోలు చేసేది. భూమిని బట్టి ఇన్‌పుట్‌ సబ్సిడీని త్వరితగతిన మంజూరు చేసేది. రైతులు పంట ఉత్పత్తులను తమకు నచ్చిన రీతిలో గిట్టుబాటు ధరలకు విక్రయించుకునే అవకాశం లభించేది. రైతుభరోసా కేంద్రంలో కొనుగోలు చేసిన ప్రతి ఉత్పత్తికి రసీదులు అందజేయడం ద్వారా క్షేత్రస్థాయిలో వ్యవసాయ సహాయకులు పారదర్శకత పాటించేవారు.

టీడీపీ హయాంలో..

గతంలో టీడీపీ హయాంలో పంటల నమోదు ప్రక్రియ జరిగేది కాదు. విపత్తులు వచ్చి పంట నష్టం జరిగితే.. సదరు రైతు సాగు చేసినట్లు ఆధారాల్లేవ్‌ అని పరిహారం ఇచ్చేందుకు నిరాకరించేది. ఇలాంటి సందర్భాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే నష్టపరిహారాన్ని టీడీపీ నేతలు రైతుల పేర్లు పెట్టుకుని కాజేస్తుండేవారు. ఇక సంక్షేమ పథకాలు అయితే రైతుల దరి చేరేవి కాదు. తాజాగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమం నుంచి తప్పుకునేందుకు సిద్ధమవుతుందని అర్థమవుతోంది. ఖరీఫ్‌ ప్రారంభంలోనే ప్రభుత్వం బీమా నమోదు రైతుల బాధ్యతే అంటూ తన బాధ్యత నుంచి తప్పుకుంది. ఇప్పటి వరకు రైతులకు పెట్టుబడి సాయం అందించలేదు. మే నెలలో అందించాల్సిన రైతు భరోసా సాయంపై ఇంత వరకు స్పష్టత లేదు. ఇక ఈ– క్రాఫ్‌ నమోదుపై ఇంత వరకు వ్యవసాయశాఖకు ఎలాంటి మార్గదర్శకాలు జారీ చేయలేదు. దీన్ని బట్టి ఈ–క్రాప్‌.. అంతే సంగతులు అన్నట్లుగా ఉంది.

తీవ్రంగా నష్టపోతాం



ఈ–క్రాప్‌ విధానాన్ని సక్రమంగా అమలు చేయకపోతే రైతు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. ఈ–క్రాప్‌ చేయకపోతే పంట ఉత్పత్తులకు సరైన గిట్టుబాటు ధర లభించదు. ప్రభుత్వం వెంటనే ఈ–క్రాప్‌ నమోదును చేపట్టాలి.

– రత్తయ్య, రైతు, అయ్యవారిపల్లి

ఆదేశాలు రాలేదు



ఖరీఫ్‌ సీజన్‌కు సంబంధించి ఈ–క్రాప్‌ విధానం అమలుపై ప్రభుత్వ పరంగా ఆదేశాలు అందలేదు. వర్షాలు కురుస్తుండడంతో ఖరీఫ్‌ పనులు ఊపందుకున్నాయి. త్వరలో ప్రభుత్వం ప్రకటించే నిర్ణయం ప్రకారం రైతులకు మేలు చేసేలా తోడ్పాటు అందిస్తాం.

– చెన్నారెడ్డి, ఏఓ, సీతారామపురం

పింఛన్‌ అందకుంటే మా దృష్టికి తీసుకురండి

- మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

నెల్లూరు (దర్గామిట్ట): తప్పుడు హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం, దశల వారీగా సామాజిక పింఛన్లకు కోత విధిస్తోందని, ఇంటి వద్దకే ఇవ్వడం లేదని, ఎవరికైనా పింఛన్‌ రాకపోతే మా దృష్టికి తీసుకురావాలని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. గురువారం ఆయన వీడియో సందేశాన్ని విడుదల చేశారు. వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో వలంటీర్ల ద్వారా ప్రతి లబ్ధిదారుడి ఇంటికే పొద్దు పొడవక ముందే పింఛన్‌ పంపిణీ జరుగుతుండేదన్నారు. కూటమి పార్టీల నేతలు పింఛన్‌ మొత్తాన్ని పెంచి ఇస్తామని, గతంలో మాదిరిగానే ప్రతి ఒక్కరికి పింఛన్‌ ఇస్తుందని ప్రచారం చేశారన్నారు. అధికారంలోకి వచ్చాక కొత్త పింఛన్లను ఇవ్వడం పక్కన పెడితే.. ఉన్న పింఛన్లను రద్దు చేస్తున్న పరిస్థితి కనిపిస్తుందన్నారు. జిల్లాలో ఏ ప్రాంతం వారికైనా పింఛన్‌ రాకపోతే వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన కాల్‌ సెంటర్‌ ద్వారా మా దృష్టికి తీసుకురావాలని కోరారు. అటువంటి లబ్ధిదారుల విషయాన్ని ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామని మాజీ మంత్రి కాకాణి హామీ ఇచ్చారు. పింఛన్‌ ఇవ్వకపోయినా, ఇంటికి చేర్చకపోయినా 87126 03258 నంబరుకు ఫోన్‌ చేసి కానీ, మెసేజ్‌ ద్వారా కానీ, వాట్సాప్‌ మెసేజ్‌ ద్వారా తెలిపితే న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు.

తీర్థ యాత్రలకు వెళ్తూ..

- కారు ఢీకొని బిహార్‌ వాసి మృతి



అభిమన్యు ప్రసాద్‌ (ఫైల్‌)

నెల్లూరు (క్రైమ్‌): కుటుంబ సభ్యులు, గ్రామస్తులతో కలిసి తీర్థయాత్రకు బయలుదేరిన బిహార్‌ వాసిని కారు రూపంలో మృత్యువు కాటేసింది. పోలీసుల సమాచారం మేరకు.. బిహార్‌ రాష్ట్రం సివాన్‌ జిల్లా మహారాజ్‌గంజ్‌ మండలం పురాణిబజార్‌ గ్రామానికి చెందిన అభిమన్యు ప్రసాద్‌ (73) గత నెల 24న తన కుటుంబం, గ్రామస్తులతో కలిసి బస్సులో తీర్థ యాత్రలకు బయలుదేరారు. బుధవారం సాయంత్రం శ్రీశైలంలో మల్లికార్జున స్వామిని దర్శించుకుని అక్కడి నుంచి తిరుమలకు బయలుదేరారు. గురువారం తెల్లవారుజామున ఐదు గంటల ప్రాంతంలో జాతీయ రహదారిపై నారాయణ ఇంజినీరింగ్‌ కళాశాల జంక్షన్‌ సమీపంలోని హెచ్‌పీ పెట్రోల్‌ బంకు వద్దకు చేరుకున్నారు. అక్కడ బస్సును నిలిపి అందరూ కాలకృత్యాలు తీర్చుకునేందుకు కిందకు దిగారు. ఈ క్రమంలో అభిమన్యు ప్రసాద్‌ రోడ్డు దాటుతుండగా చెన్నై నుంచి అద్దంకి వెళ్తున్న కారు వేగంగా ఢీకొంది. ఈ ఘటనలో ఆయనకు తీవ్రగాయాలయ్యాయి. గమనించిన కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఘటనా స్థలానికి చేరుకుని అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం సమీపంలోని మెడికవర్‌ హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుమారుడు చున్నూకుమార్‌ ఫిర్యాదు మేరకు నెల్లూరు నార్త్‌ ట్రాఫిక్‌ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహానికి జీజీహెచ్‌లో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. దీంతో అందరూ తీర్థ యాత్రను అర్థంతంగా విరమించుకుని మృతదేహంతో స్వగ్రామానికి బయలుదేరారు. నార్త్‌ ట్రాఫిక్‌ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జీజీహెచ్‌లో ముక్కుకు అరుదైన ఆపరేషన్‌



ముక్కు ఆపరేషన్‌ చేయించుకున్న దీక్షిత

నెల్లూరు(అర్బన్‌): దర్గామిట్టలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి (జీజీహెచ్‌)లో అరుదైన ఆపరేషన్‌ను గురువారం వైద్యులు విజయవంతంగా నిర్వహించారు. ఓ విద్యార్థినికి ముక్కు నుంచి గొంతు వైపు గడ్డ పెరిగింది. దీంతో ఆమె ఆహారం మింగలేక తీవ్ర ఇబ్బందులు పడుతోంది. అరుదైన ఈ శస్త్ర చికిత్సను రూపాయి ఖర్చు లేకుండా ఆపరేషన్‌ చేసి తొలగించారు. ఆస్పత్రి ఈఎన్‌టీ హెచ్‌ఓడీ డాక్టర్‌ సుకుమార్‌ ఇందుకు సంబంధించిన వివరాలు ప్రకటించారు. నగరానికి చెందిన పెంచలయ్య, వసంత దంపతుల కుమార్తె దీక్షిత (17 ఏళ్లు) చదువుకుంటోంది. ఆ విద్యార్థిని ఆరు నెలలకు పైగా ముక్కు ద్వారా గాలి పీల్చుకోవడం కష్టతరంగా మారింది. తల్లిదండ్రులు ఆ బాలికను నగరంలోని ప్రైవేట్‌ ఈఎన్‌టీ డాక్టర్ల వద్దకు తీసుకెళ్లి చూపించగా ఆపరేషన్‌ చేయాలని రూ.లక్ష ఖర్చు అవుతుందని తెలిపారు. దీంతో అంత భరించలేక వారు తమ కుమార్తె దీక్షితను ప్రభుత్వ పెద్దాస్పత్రి (జీజీహెచ్‌)కు వారం రోజుల క్రితం తీసుకెళ్లారు. పరిశీలించిన డాక్టర్‌ సుకుమార్‌ బాలిక ముక్కుకు సీటీ స్కాన్‌ పరీక్ష చేయగా ముక్కులో నుంచి గొంతు వైపు పెద్ద గడ్డ పెరిగినట్లు గుర్తించారు. అరుదైన ఈ శస్త్ర చికిత్సను చేసి ముక్కులో ఉన్న గడ్డను తొలగించారు. ఆపరేషన్‌ చేయించడంలో ఆస్పత్రి సూపరింటెండెంట్‌ డాక్టర్‌ సిద్ధానాయక్‌ చొరవ తీసుకున్నారు. ఆపరేషన్‌ సక్సెస్‌ చేసిన ఈఎన్‌టీ డాక్టర్ల టీం సుకుమార్‌, శ్రీదేవి, కల్యాణి, అనస్థీషియా హెచ్‌ఓడీ డాక్టర్‌ శ్రీనివాసులు, డాక్టర్‌ శారదను సూపరింటెండెంట్‌ అభినందించారు.

ఆంధ్రప్రదేశ్‌ ఆర్థిక పరిస్థితి అధోగతి

- సీడబ్ల్యూసీ సభ్యుడు చింతామోహన్‌



మాట్లాడుతున్న డాక్టర్‌ చింతామోహన్‌

నెల్లూరు (బారకాసు): ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అధోగతి పాలైందని కేంద్ర మాజీ మంత్రి, సీడబ్ల్యూసీ సభ్యుడు డాక్టర్‌ చింతామోహన్‌ అన్నారు. గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. గతంలో దివంగత ఎన్టీరామారావు, వైఎస్‌ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రులుగా ఉన్న సమయంలో ఆంధ్రప్రదేశ్‌ ప్రజల ప్రతిష్ట ఎంతో గొప్పగా ఉండేదన్నారు. ఇప్పుడు ఆ పరిస్థితి కనిపించడం లేదన్నారు. ఒకప్పుడు కేంద్రం మెడలు వంచి డిమాండ్‌గా రాష్ట్రానికి అవసరమైన నిధులు తెచ్చుకోవడమే కాకుండా కేంద్రమే అడగకుండానే ఇచ్చేదన్నారు. ఇప్పటి పరిస్థితుల్లో అడుక్కున్నా ఇచ్చే అవకాశాలు కనిపించడం లేదన్నారు. ఇటీవల కేంద్రం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు ఒక్క పైసా కూడా కేటాయించలేదని కేవలం రూ.15 వేల కోట్లు అప్పు బ్యాంక్‌ ద్వారా పొందేలా ఏర్పాటు చేసిందన్నారు. దీనికే తానేదో కేంద్రం నిధుల నుంచి ఇచ్చినట్లుగా ప్రధాని మోదీ గొప్పలు చెప్పడం, రాష్ట్ర సీఎం చంద్రబాబు గంతులేయడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్ర పరిస్థితి ఇంత దారుణంగా దిగజారిపోవడానికి కారణం రాష్ట్ర విభజన అనంతరం 10 ఏళ్లు ఉమ్మడిగా ఉండాల్సి ఉన్నా లేకుండా పోయిందన్నారు.

ప్రతిష్టాత్మకంగా తల్లి పాల వారోత్సవాలు



హేనసుజన్‌

నెల్లూరు(వీఆర్సీసెంటర్‌): జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో అంతర్జాతీయ తల్లి పాలవారోత్సవాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్లు జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ సాధికారత అధికారిణి బి.హేనసుజన్‌ అన్నారు. ఐసీడీఎస్‌ జిల్లా కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ గురువారం నుంచి 7వ తేదీ వరకు ‘అంతరాలు లేకుండా అందరికీ తల్లి పాల మద్దతు’ అనే నినాదంతో ఈ వారోత్సవాలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చదివే పిల్లల తల్లులు, కుటుంబ సభ్యుల సమక్షంలో నిర్వహిస్తున్నామన్నారు. పుట్టిన గంట లోపు తల్లిపాలను అందించడం, మొదటి ఆరు నెలలు ప్రత్యేకంగా తల్లిపాలు ఇవ్వడం, రెండేళ్ల వరకు తల్లి పాలను కొనసాగించడంతో పాటు, సురక్షితమైన పోషకాహారాన్ని పరిచయం చేయడంపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఇన్‌ఫెక్షన్లు, పోషకాహార లోపానికి వ్యతిరేకంగా ఒక శక్తివంతమైన రక్షణ కవచాన్ని అందించడానికి పిల్లల్లో మెదడు అభివృద్ధి పరచడానికి తప్పనిసరిగా రెండు సంవత్సరాలు తల్లిపాల పోషణ అవసరమన్నారు.

విరివిగా రక్తపరీక్షలు చేయాలి

- మలేరియా నివారణ అధికారి హుస్సేనమ్మ



మాట్లాడుతున్న మలేరియా నివారణ అధికారి హుస్సేనమ్మ తదితరులు

నెల్లూరు (అర్బన్‌): అడపాదడపా వర్షాలతో దోమలు ప్రబలి మలేరియా, డెంగీ వంటివి పెరుగుతున్న నేపథ్యంలో వ్యాధి నిర్ధారించేందుకు ల్యాబ్‌ టెక్నీషియన్లు విరివిగా రక్త పరీక్షలను చేయాలని జిల్లా మలేరియా నివారణాధికారి హుస్సేనమ్మ సూచించారు. గురువారం సంతపేటలోని డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో పని చేస్తున్న ల్యాబ్‌ టెక్నీషియన్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ జ్వరాలు అధికంగా ప్రబలుతున్న నేపథ్యంలో ల్యాబ్‌ టెక్నీషియన్లు తమకు ఇచ్చిన టార్గెట్లను పూర్తి చేస్తూ అదనంగా రక్తపరీక్షలు చేయాలన్నారు. సరైన ఫలితాలను సకాలంలో డాక్టర్లకు అందించాలన్నారు. రక్త పరీక్షలకు సంబంధించి నూతనంగా వచ్చిన పరికరాలను వినియోగించాలని సూచించారు. 52 పీహెచ్‌సీలు, 28 అర్బన్‌ హెల్త్‌ సెంటర్లలో చేసిన ప్రతి పరీక్ష రిపోర్టును ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సహాయ మలేరియా నివారణాధికారి నాగార్జునరావు, ల్యాబ్‌టెక్నీషియన్లు, డీఎంఓ ఆఫీసు సిబ్బంది పాల్గొన్నారు.

కొలిక్కిరాని తహసీల్దార్ల నియామకం

- జిల్లాలో పేరుకుపోతున్న ఫైళ్లు
- పోస్టింగ్‌ల కోసం ఎదురుచూపులు

నెల్లూరు(దర్గామిట్ట): కొత్త ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలు గడుస్తున్నా.. పాలనా వ్యవస్థలో ప్రధాన భూమిక పోషించే రెవెన్యూ విభాగంలో తహసీల్దార్ల నియామకం కొలిక్కి రాకపోవడంతో రోజురోజుకు సమస్యలు పెరిగిపోతున్నాయి. సార్వత్రిక ఎన్నికల సమయంలో జిల్లా నుంచి 40 మంది తహసీల్దార్లను బాపట్ల, గుంటూరు, పల్నాడు, ప్రకాశం తదితర ప్రాంతాలకు బదిలీ చేశారు. ఎన్నికల అనంతరం అక్కడి నుంచి అందరూ రిలీవ్‌ అయి వచ్చారు. జిల్లాలో అన్ని మండలాలు రెవెన్యూ డివిజన్లు, కలెక్టరేట్‌ కార్యాలయంతో కలిపి 53 మంది తహసీల్దార్ల నియామకం జరగాల్సి ఉంది.

సీసీఎల్‌ఏ ప్రత్యేక ఉత్తర్వులు

ప్రభుత్వం నుంచి తహసీల్దార్ల పోస్టింగ్‌లకు సంబంధించి సీసీఎల్‌ఏ ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్నికలకు ముందు గత అసెంబ్లీ నియోజకవర్గంలో పని చేసిన వారు ఆ నియోజకవర్గానికి అనర్హులు. వీటితో పాటు సొంత డివిజన్‌లో తహసీల్దార్లను నియమించకూడదు. ఈ నిబంధనలతో తహసీల్దార్లలో కొంత మందికి పోస్టింగ్‌లు దక్కేలా లేవు. ఇందుకోసం ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన నెల్లూరు, తిరుపతి జిల్లాల కలెక్టర్‌, డీఆర్‌ఓతో కలిసి త్రిసభ్య కమిటీ ఏర్పాటు చేసుకుని వారికి పోస్టింగ్‌లు ఇవ్వాల్సి ఉంది. పొరుగు జిల్లాల్లో ఎన్నికల సమయంలో విధులు నిర్వర్తించి రిలీవ్‌ అయిన తహసీల్దార్లు పోస్టింగ్‌ల కోసం దాదాపు వారం రోజులుగా ఎదురు చూస్తున్నారు. ఒక్కసారిగా జిల్లాలో తహసీల్దార్లు పోస్టులు ఖాళీగా ఉండడంతో సమస్యలు పేరుకుపోయాయి. ఒక్క రెవెన్యూ సంబంధిత కలెక్టరేట్‌ సెక్షన్‌లోనే దాదాపు 140 ఫైళ్లు నిలబడిపోయాయంటే సమస్య జఠిలం ఏ మాత్రం ఉందో తెలుస్తుంది.

రెండు రోజుల్లో పోస్టింగ్‌ల ప్రక్రియ పూర్తి చేస్తాం



జిల్లాలో ఖాళీగా ఉన్న తహసీల్దార్ల పోస్టింగ్‌ల భర్తీ ప్రక్రియ రెండు రోజుల్లో పూర్తి చేస్తాం. మరి కొందరు తహసీల్దార్లు జిల్లాకు వచ్చి రిపోర్ట్‌ చేయాల్సి ఉంది. త్వరలో పూర్తి చేస్తాం.

–ఓ ఆనంద్‌, కలెక్టర్‌